www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -152 బుధవారం 16 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

# యూపీఐ బాదుడు!



## రూ. 2వేలు దాటితేయూపీఐ లావాదేవీలపై

### త్వరలో చార్జీల వసూలుకు కేంద్రం సన్నద్ధం

### బ్యాంకర్లతో కమిటీ ఏర్పాటు

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 15: (ప్రజావినికిడి):** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే పలు డిజిటల్ చెల్లింపులపై ఇప్పటివరకు ఉన్న ఉచిత విధానానికి మోడీ సర్కార్ స్వస్తి చెప్పాలని నిర్ణయించింది. రూ.2,000 కంటే తక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలకు ఎటువంటి చార్జీలు ఉండవని చెబుతున్నప్పటికీ.. అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే వ్యాపార చెల్లింపులపై (పీ2ఎం), మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ప్రాసెసింగ్ **మిగతా 2లో...**




నాడు.. వినియోగదారులపై ఎలాంటి భారాలు పడవంటూ జీఎస్టీని తెరపైకి తెస్తున్నప్పుడు మోడీ సర్కార్ బుకాయించింది. అంతా ఉత్పత్తి చేసే కంపెనీ యాజమాన్యమే భరిస్తుందనటంతో దేశ ప్రజలు గుడ్డిగా నమ్మారు. కానీ జరిగిందేంటీ..? యాజమాన్యంతో కేంద్రం లాలూచీ పడింది. జీఎస్టీ భారమంతా వినియోగదారుని నెత్తిన రుద్దేసింది. అచ్చం అదే విధంగా ఇప్పుడు యూపీఐ లావాదేవీలపైనా కేంద్రం ఇలాంటి ఎత్తుగడే వేస్తున్నది. డిజిటల్ చెల్లింపుల రూపంలో వేలకోట్ల లావాదేవీలు జరుగుతుండడంతో.. వినియోగదారులను బాదేసి ఖజానా నింపుకుందామనే ఆలోచన చేసింది. ఉపాధి, ఆదాయాల్లేక నానా ఇబ్బందులు పడుతున్న జనాన్ని పీల్చిపిప్పి చేసేలా చార్జీల భారాన్ని అమల్లోకి తేనున్నది. మరోవైపు ఈ నిర్ణయం అమెరికా ఒత్తిడి మేరకే చేపడుతున్నట్టు స్పష్టమవుతోంది.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించండి టూరిజం, ఎడ్యుకేషన్ రంగాల్లో సహకరించండి

: ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం

తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ లో ప్రిన్స్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీప్రభుత్వ సేవలు పొందండి




**హైదరాబాద్ సెప్టెంబర్ 15: (ప్రజావినికిడి):**
భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి **మిగతా 2లో...**

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు..

- ఈనెల 22న ఓటర్ల జాబితా
- 41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు
- ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం
- 2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ
- ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

**2లో.**



## పరస్పర సున్నితత్వం పాటించాలి

: జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ



శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం **మిగతా 2లో...**

## (ఏపీపీఎస్సీ) 892 పోస్టుల నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు భారీ ఊరట..

892 పోస్టుల భర్తీ.. గ్రూప్-1 సహా నోటిఫికేషన్ల విడుదల!

గ్రూప్-1లో 163 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

11 డిప్యూటీ కలెక్టర్లు, 36 డీఎస్పీ ఉద్యోగాల భర్తీ

**అమరావతి (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఉద్యోగార్థులకు బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోని 20 విభిన్న ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మొత్తం 892 పోస్టుల భర్తీకి అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగానే కీలకమైన గ్రూప్-1 సర్వీసులలో 163 పోస్టులు సహా వివిధ విభాగాల్లో **మిగతా 2లో...**




## 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

అసెంబ్లీలో ప్రసంగించనున్న రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసాగుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై **మిగతా 2లో...**



## 5 లక్షల ఇళ్లు మంజూరు

- తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక.. అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు
- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం
- త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక




**2లో.**

## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..



పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు

కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

**తిరుమల సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.వారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై **2లో...**



## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్

పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్

రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు



**హైదరాబాద్ సెప్టెంబర్ 15: (ప్రజావినికిడి):**
హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని.. **మిగతా 2లో...**

# యూపీఐ బాదుడు!

**మొదటి పేజీ తరువాయి**

చార్జీలను ప్రవేశపెట్టేందుకు చట్టపరమైన మార్గం సుగమం చేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి పార్లమెంటులో ఇటీవల 'టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు-2026' ద్వారా 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007'లోని సెక్షన్ 10ఎకు సవరణ చేశారు. దీని ప్రకారం రూ.2,000 వరకు చేసే యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ చెల్లింపులకు ఎలాంటి చార్జీలు వర్తించవు. అయితే ఈ పరిమితిని దాటిన వ్యాపార లావాదేవీలపై చార్జీలు విధించేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, వివిధ సంఘాల ప్రతినిధులతో కూడిన 22 మంది సభ్యుల 'యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ' త్వరలోనే సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుందని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం దేశంలో 55 కోట్లకు పైగా ప్రజలు యూపీఐని ఉపయోగిస్తున్నారు. జులై 2026 ఒక్క నెలలోనే ఏకంగా 2,366 కోట్ల లావాదేవీలు జరిగి రూ. 29.9 లక్షల కోట్ల విలువైన బదిలీలు నమోదయ్యాయి.

**ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోదీ : కాంగ్రెస్**

రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు లేదా ఎండీఆర్ విధించడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా పేమెంట్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్ర మోదీ భారత్‌లోని జీరో ఎండీఆర్ విధానాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. యూపీఐ లావాదేవీల పరిమాణం పరంగా రూ.2,000 దాటినవి కేవలం 5 శాతమే అయినప్పటికీ.. మొత్తం లావాదేవీల విలువలో అవి దాదాపు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాహుల్ గాంధీ వెల్లడించారు. వినియోగదారుల నుంచి నేరుగా చార్జీలు వసూలు చేయకపోయినా.. వ్యాపారులు ఈ భారాన్ని చివరికి పెరిగిన ధరల రూపంలో సాధారణ ప్రజల పైనే రుద్దుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని, ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల పన్ను పేరుతో ప్రజల పొదుపును హరిస్తున్నారని మండిపడ్డారు. రూ.5,000 లావాదేవీలపై రూ.25, రూ.10,000 లావాదేవీలపై రూ.50 వరకు అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించక పోగా మోదీ ప్రభుత్వం ప్రజల జేబులు ఖాళీ చేయడానికి కొత్త మార్గాలను వెతుకుతోందని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఏదైనా ఎండీఆర్ వర్తిస్తే అది కేవలం నిర్దిష్ట వర్గానికి చెందిన పెద్ద వ్యాపార లావాదేవీలపై మాత్రమే ఉంటుందని.. వినియోగదారులు నేరుగా ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు.

**గూగుల్‌పే, ఫోన్‌పేకు భారీగా లబ్ధి**

భారతదేశపు యూపీఐ మార్కెట్‌లోనూ అమెరికా సంస్థలైన గూగుల్ పే, వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫోన్‌పే ఇప్పటికే 80 శాతానికి పైగా లావాదేవీలను నియంత్రిస్తున్నాయి. ఏ ఒక్క యాప్ కూడా 30 శాతానికి మించి మార్కెట్ వాటా కలిగి ఉండకూడదన్న ఎన్‌పీసీఐ నిబంధనను కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీంతో ఈ నిబంధన అమలును ప్రభుత్వం డిసెంబర్ 2026 వరకు వాయిదా వేస్తూ వచ్చింది. దీనికితోడు డేటా లోకలైజేషన్ నిబంధనలను కూడా అమెరికా కంపెనీలు తప్పుబడుతున్నాయి. భారత ప్రజాధనంతో నిర్మితమైన డిజిటల్ మౌలిక సదుపాయాలలో విదేశీ కంపెనీలు ఇంతటి ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నప్పటికీ.. అమెరికా మాత్రం తమ వీసా, మాస్టర్‌కార్డ్ కంపెనీల లాభాల కోసం భారత్‌పై ఒత్తిడి పెంచుతూనే ఉంది. అమెరికా వాణిజ్య ఒత్తిళ్లకు తలొగ్గి ఉచిత సేవలకు స్వస్తి పలకడం లేదా నిబంధనలను సడలించడం భారత డిజిటల్ సార్వభౌమత్వానికి మంచిది కాదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఒత్తిళ్లకు కాకుండా భారత వినియోగదారులు, వ్యాపారులు, బ్యాంకులు, ఎన్‌పీసీఐ ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర విధానాలు ఉండాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి

**రూ.2,000 దాటితే 0.4 శాతం చార్జీలు**

**గరిష్టంగా రూ.300 వరకు వసూలు**

భారతదేశంలో కోట్లాది మంది వినియోగిస్తున్న యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకు పూర్తిగా ఉచితంగా కొనసాగుతున్న యూపీఐ లావాదేవీల విధానంలో కీలక మార్పులు చేస్తూ ఎన్‌పీసీఐ మంగళవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే వ్యాపార చెల్లింపులపై 0.4 శాతం మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తించనుంది. ఈ కొత్త నిబంధనలు వచ్చే నెల అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. రూ.2,000 దాటిన వ్యక్తి నుంచి వ్యాపారికి (పీ2ఎం) చెల్లింపులపై మాత్రమే ఎండీఆర్ చార్జీలు వర్తిస్తాయని ఎన్‌పీసీఐ తెలిపింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) లావాదేవీలపై చార్జీలుండవు.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు టర్నోవర్ కలిగిన చిన్న వ్యాపారులకు ఈ చార్జీల నుంచి పూర్తి మినహాయింపునిచ్చారు. అలాగే రూ.2,000 లోపు ఉండే అన్ని వ్యాపార చెల్లింపులు, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలు కూడా యథావిధిగా ఉచితంగానే జరగనున్నాయి. ఒకవేళ లావాదేవీల విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే ఎండీఆర్‌ను గరిష్టంగా రూ.300కు పరిమితం చేశారు. కొన్ని ప్రత్యేక రంగాలకు భిన్నమైన విధానాన్ని ప్రకటించారు. రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధన రంగాలు, వ్యవసాయ ముడి సరుకులకు సంబంధించి రూ.2,000 దాటిన లావాదేవీలపై శాతం లెక్క కాకుండా కేవలం రూ.5 ఎండీఆర్ వసూలు చేస్తారు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్ల చెల్లింపులకు గరిష్టంగా రూ.300 వరకు పరిమితం చేస్తూ కేవలం 0.02 శాతం మాత్రమే ఎండీఆర్ విధించనున్నారు. వసూలైన ఎండీఆర్‌లో 5 శాతాన్ని చిన్న వ్యాపారుల్లో డిజిటల్ సేవలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక నిధిగా కేటాయించనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

## 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

**మొదటి పేజీ తరువాయి**

చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా? అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు అదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు..

**అమరావతి సెప్టెంబర్ 15: (ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు.

2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా (ఁబఖుశ్రీఱటఎఱఅస్త్ర ఇఖ్వ) ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది. ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

**మొదటి పేజీ తరువాయి**

. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## 5 లక్షల ఇళ్లు మంజూరు

**ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు ,తెలంగాణకు 2 లక్షల ఇళ్లు**

**అమరావతి సెప్టెంబర్ 15: (ప్రజావినికిడి):**

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

**మొదటి పేజీ తరువాయి**

ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

**మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి**

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ,

**: మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**



కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

"పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

## (ఏపీపీఎస్సీ) 892 పోస్టుల నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల అభ్యర్థులు నిబంధనలు పరిశీలించి అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

**నోటిఫికేషన్ల ప్రకారం పోస్టుల వివరాలు:**

గ్రూప్-1 సర్వీసులు (163 పోస్టులు): 11 డిప్యూటీ కలెక్టర్లు, 36 డీఎస్పీ (సివిల్), 3డీఎస్పీ (కమ్యూనికేషన్స్), 14 టాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్లు, 35 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ణఖూ), 15 డిప్యూటీ రిజిస్ట్రార్లు, 12 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, 14 డిస్ట్రిక్ట్/డివిజనల్ ఫైర్ ఆఫీసర్లు, 14 అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ల పోస్టులతో పాటు ఇతర ఉన్నత పోస్టులు ఉన్నాయి.

ఇతర ముఖ్య శాఖల్లో ఖాళీలు: అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు (196), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 (73), హార్టికల్చర్ ఆఫీసర్లు (37), పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఎనలిస్ట్ గ్రేడ్-2 (18), ఏపీ అసెంబ్లీ రిపోర్టర్లు (11), ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, ఫోరెన్సిక్ సైన్స్ తదితర పోస్టులు భర్తీ కానున్నాయి.

**దరఖాస్తు గడువు .. ముఖ్య సమాచారం:**

గ్రూప్-1 దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 6 నుండి ప్రారంభమై అక్టోబర్ 27 వరకు కొనసాగనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు నిబంధనలు, విద్యార్హతలు, వయోపరిమితికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ాూూూజ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకుని గడువులోగా అప్లై చేసుకోవచ్చని బోర్డు తెలిపింది.

## పరస్పర సున్నితత్వం పాటించాలి

**మొదటి పేజీ తరువాయి**

చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

# ఎన్టీఆర్ భవన్ లో నెలకొల్పిన విఘ్నేశ్వరుడికి పూజలు

**విఘ్నేశ్వరుడికి తొలి పూజలు చేసిన టిడిపి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు టిడిపి శ్రేణులు**





**హైదరాబాద్,(ప్రజావినికిడి):**తెలుగుదేశం పార్టీ నాయకులు,సోదర కార్యకర్తలు,మహిళా మణులు అందరికీ తెలుగుదేశం పార్టీ తరఫున వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కనినరసింహులు. హైదరాబాదులోని ఎన్టీఆర్ భవన్ టిడిపి పార్టీ కార్యాలయంలో వినాయక చవితిని పురస్కరించుకొని నెలకొల్పిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవుని నిత్య జీవితంలో విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే దైవము వినాయకుడు అని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల తోపాటు భారతదేశం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రినఆంధ్రప్రదేశ్ రథసారథి నారా చంద్రబాబు నాయుడు 1972వ సంవత్సరంలో బీ.ఏ చదువుతున్న సందర్భంలో స్వగ్రామాయమైన నారావారి పల్లికి వెళ్లే క్రమంలో రోడ్డు సౌకర్యం లేని కారణంగా గ్రామంలో(వినాయక సంఘం) ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో నారావారిపల్లె నుండి భీమవరం వరకు(5.5)ఐదున్నర కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలని, దాంతోపాటు గ్రామంలో చెరువులు,కుంటలను బాగు చేయించి వ్యవసాయ అనుకూలంగా మార్చడంలో కీలకపాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జన్మభూమి, శ్రమదానం వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అగ్రగామిగా నిలపడంలో సీఎం చంద్రబాబు నాయుడు పాత్ర కీలకమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామమైన నారావారిపల్లిలో వినాయక సంఘం ఏర్పాటు చేసి నేటితో 54 సంవత్సరాలు గడిచిన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు కు బక్కని నరసింహులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదిశంకరాచార్యుల పటించిన కనకధారా స్తోత్రం లోని నమో అస్తు నాళీకని బానన్నాయై నమో అస్తు దుగోదాది జన్మభూమాయై నమో అస్తు సోమమృత సోదరాయై నమో అస్తు నారాయణ వల్లభయై అంటు మంగళవారం రోజు రాష్ట్ర పార్టీ కార్యాలయం లో వినాయక చవితి పర్వదినం సందర్భంగా..గణపతి పూజ కార్యక్రమం జరిగింది.ఈ పూజ కార్యాక్రమంలో పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు,అరవింద్ కుమార్ గౌడ్ రాష్ట్ర నాయకులు చిలువేరు కాశినాథ్,బంటు వేంకటేశ్వర్లు,కాట్రగడ్డ ప్రసూన,అజ్మీరా రాజునాయక్ శ్రీపతి సతీష్,పోలంపల్లి అశోక్,కుమార్ గౌడ్,వెజండ్ల కిశోర్ బాబు,కట్టా రాములు,శ్రీశైలపు మహానంది,రాఘవులు,రాజు,నర్సింహలు,చంద్రశేఖర్, పార్టీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తమదైన గుర్తింపు కోసం యువత డిజిటల్ కమ్యూనిటీల వైపు మొగ్గు

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**

యువతలో ఒంటరితనం వేగంగా ఒక నిశ్శబ్ద మహమ్మారిగా మారుతున్న తరుణంలో, వినోదం కోసం మాత్రమే కాకుండా, అనుబంధం, భావవ్యక్తీకరణ, తమదైన గుర్తింపు కోసం కొంత మంది యువత డిజిటల్ కమ్యూనిటీల వైపు మొగ్గుచూపుతున్నారు.అలాంటి కథల్లో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన 22 ఏళ్ల శ్రీ సాయిది.చిన్న వయసులోనే తల్లిని కోల్పోవడంతో తాతయ్య, నానమ్మల వద్ద పెరిగిన సాయి, తన తండ్రి సాన్నిధ్యం కూడా ఎక్కువగా లేకపోవడంతో తరచూ ఒంటరితనాన్ని అనుభవించేవాడు.తన చుట్టూ ఉన్న చాలామంది పూర్తిగా అర్థం చేసుకోలేని కలలను సాకారం చేసుకోవాలనే లక్ష్యంతో అతను ముందుకు సాగాడు.పాటల రచన,ఎడిటింగ్, కంటెంట్ క్రియేషన్,కథా రచనపై ఆసక్తి ఉన్న శ్రీ సాయి, తెలుగు చిత్ర పరిశ్రమలో కెరీర్‌ను నిర్మించుకోవాలని కలలు కనేవాడు. అయితే,ఆ ఆశయాలను కుటుంబ అంచనాలతో సమన్వయం చేసుకోవడం అతడికి తరచూ ఒంటరితనం, అనిశ్చితితో కూడిన ప్రయాణంగా మారిందనీ పేర్కొంది.అతని జీవితంలో కీలకమైన మలుపు భారత్‌లో తొలి అవతార్ ఆధారిత ఆడియో సోషల్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ అయిన ఫ్రెండ్ ను పరిచయం చేసుకున్నప్పుడు వచ్చిందనీ, జీవితంలో కష్టతరమైన దశను ఎదుర్కొంటున్న సమయంలో తోడుగా ఉండే వ్యక్తుల కోసం తొలుత ఈ యాప్‌లో చేరిన శ్రీ సాయి, కొంతకాలానికే ఎన్నో ఏళ్లుగా తనకు కొరవడిన ఒక విషయాన్ని అక్కడ కనుగొన్నాడు..తన మాటలను నిజంగా వినాలనుకునే వ్యక్తులతో కూడిన కమ్యూనిటీ.ఈ ప్లాట్‌ఫామ్‌లో అతనికి ఎంతో సన్నిహితమైన స్నేహితులు ఏర్పడ్డారని జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా, కష్టసుఖాల్లో అతనికి అండగా నిలిచే స్నేహితులను ఫ్రెండ్ యాప్ ద్వారా శ్రీ సాయి సంపాదించుకున్నాడనీ వెల్లడించింది.

# పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న మహేష్ కుమార్ గౌడ్

**శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో సంతృప్తికరంగా సాగిందని,గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తలకు భరోసా,పార్టీకి బలాన్ని అందించగలిగామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్,రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి తో కలిసి గాంధీ భవన్ లో మహేష్ కుమార్ గౌడ్ ను సన్మానించారు.ఈ సందర్భంగా అసెంబ్లీలో సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేశామని తెలిపారు.కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించగలిగామని అన్నారు.పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంలోవిజయవంతమయ్యామని పేర్కొన్నారు.గత రెండేళ్లు సజావుగా సాగడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్న సమన్వయం ఎంతో దోహదపడిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నుంచి తనకు సంపూర్ణ సహకారం లభించిందని చెప్పారు.గాంధీ భవన్‌ను కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.మంత్రులను గాంధీ భవన్‌కు ఆహ్వానించి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.గాంధీ భవన్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించడం పీసీసీ అధ్యక్షుడిగా తనకు ఎంతోసంతృప్తినిచ్చిందని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,

పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల కాలంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసిన బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ కి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# గడ్డిఅన్నారంలో అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): సెప్టెంబర్ 15:** తెలంగాణ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తూ,పేదల ఆకలి తీర్చడంతో పాటు ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందని గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేమ్‌నాథ్ గౌడ్ అన్నారు. మంగళవారం శ్రీ కోదండరాంనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రేషన్ డీలర్ల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నవనీత తో కలిసి మాజీ కౌన్సిలర్ ప్రేమ్‌నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సునీల్ బాబు,సీనియర్ నాయకుడు పండరినాథ్ గౌడ్,డింపు తదితరులు పాల్గొన్నారు

# నా ఆరోపణలు అబద్ధమైతే..!

## మంత్రికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే సవాల్



తెలంగాణ శాసనసభలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. మంత్రి సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించిన ఆయన, తాను చెబుతున్నది అబద్ధమని నిరూపిస్తే రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన సవాల్ విసిరారు.

నేడు హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, హైదర్ నగర్‌లోని సర్వే నంబర్లు 145, 163 భూముల విషయంలో మంత్రి వాస్తవాలను మరుగుపరిచారని విమర్శించారు. మంత్రి పేర్కొన్నట్లుగా ఆ భూములపై ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్లు నిలిచిపోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాది పాటు రిజిస్ట్రేషన్లు ప్రక్రియ యథాతథంగా కొనసాగిందని ఆయన స్పష్టం చేశారు.ఈ వ్యవహారంపై 22ఏ సెక్షన్ కింద సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కృష్ణారావు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తనకు మాట్లాడే అవకాశం కల్పిస్తే, 22ఏకు సంబంధించిన పూర్తి ఆధారాలను సభ ముందు ఉంచి తన వాదనను నిరూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, "నేను చెప్పేది అబద్ధమని తేలితే, రాజకీయ సన్యాసం తీసుకుంటాను" అని ఆయన పునరుద్ఘాటించారు.

# అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది.నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఈనెల 17 నుండి టీఆర్ పి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న పాదయాత్ర..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

పట్టణంలో షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెప్టెంబర్ 17న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న గోల్కొండ కోట నుండి నిర్వహిసున్న మహా పాదయాత్ర షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు,బడుగు బలహీన వర్గాల నాయకులు ఎస్సీ ఎస్టీ బీసీ అలాగే మైనార్టీ వర్గాల రాజ్యాధికారం కోసం తీన్మార్ మల్లన్న చేస్తున్న మహా పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని ఇట్టి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.జిల్లా అధికార ప్రతినిధి భూస జంగన్న మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చినా అన్నట్టు నుంచి ఇప్పటివరకు అనుగదొక్కబడిన పాడిత పీడిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి టిఆర్పి రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న చేస్తున్న ఈ ఉద్యమానికి బహుజన జాతి వర్గాలు మద్దతు ప్రకటించాలని ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాలూకా ఉపాధ్యక్షులు మీది కేరి రాధాకృష్ణ,కొందుర్గు మండల అధ్యక్షులు దర్గ వెంకటేష్,కాశ యాదయ్య టిఆర్పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## అంబర్ పేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో
# ఘనంగా వినాయక చవితి వేడుకలు



**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి.శివం రోడ్డు లోని న్యూ ఆజాం కాంప్లెక్స్ లో గల సంఘం కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి మర్రి హరి, ప్రధాన కార్యదర్శి చిలక శివ్ కుమార్, ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య,పెద్ద బొమ్మ మధుసూదన్, అంజాల విజయ్ కుమార్,ఏ వి రాజశేఖర్, కార్యదర్శులు తీగల నరేందర్, గంగిశెట్టి మల్లేష్, రాజేందర్ నాగుల, సలహాదారులు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు యాదగిరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు భోగ నీరజ, డివిజన్ల అధ్యక్షులు గంగిశెట్టి సత్తయ్య,పెద్ద బొమ్మ దామోదర్,కోట వెంకటేష్ ఎస్ నర్సింగ్ రావు, సాయిని మూర్తి, కైరం కొండ శ్రీకాంత్,ప్రచార కార్యదర్శి వనం రమణ తదితరులు పూజలో పాల్గొన్నారు.

## పలు గణనాథుని మండపాలలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, క్రిస్టియన్ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథుని పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, లంబోదరుని కృపాకటాక్షాలతో ప్రజలందరి జీవితాల్లో ప్రతి అడుగు శుభప్రదంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కాలనీవాసులు,ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,బీఎస్ సుధీర్,మాజీ కౌన్సిలర్లు చింటు ప్రతాప్ రెడ్డి,నందాకిషోర్,చిన్న యాదగిరి,పాలమూకుల చెన్నయ్య,కాంటెస్టెడ్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్, లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకట్,మాజీ జడ్పిటిసి సాయి క్రిష్ణ,మాజీ సర్పంచ్ చక్కటి వెంకటేష్,నాయకులు సేరి శ్రీనివాసరెడ్డి,అడ్వకేట్ శ్రీనివాసరెడ్డి,ఆంజనేయులు గౌడ్,మురళి రెడ్డి,నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ 25 ఏళ్ల సుదీర్ఘ పాలన సేవలను ప్రజలకు వివరిస్తాం

### ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**శంషాబాద్ (ప్రజావినికిడి): సెప్టెంబర్ 15,** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఆయన ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల సుదీర్ఘ పాలనలో చేస్తున్న సేవలను ప్రజలకు వివరించినందుకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప అభినయ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ బిజెపి పార్టీ ఆఫీసులో జరిగిన సేవాసంకల్ప్ అభినయ్ కార్యశాల కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడారు.ఈ నెల రోజుల పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, అంగన్వాడీ కేంద్రాలలో సేవా కార్యక్రమాలు, సీనియర్ సిటిజెన్లతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామని ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో దీపాలు వెలిగించి ప్రధాని మోదీని ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో మొదలైన గణపతి ఉత్సవాలు








**వాజేడు, సెప్టెంబర్ 15,(ప్రజావినికిడి):**
వాజేడు మండలంలో గ్రామ గ్రామాన వాడల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలైనాయి ఏడుజర్లపల్లి, పూసూరు, మొరుమూరు, కొంగాల,వాజేడు, దూలాపురం, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి, పెద్దగొల్లగూడెం, చెరుకూరు, కృష్ణాపురం, టేకులగూడెం, చంద్రుపట్ల, పేరూరు, అయ్యవారిపేట, దర్మవరం, చింతూరు,ప్రతి గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో శ్రీ విగ్నేశ్వర స్వామి వారిని ఊరేగింపు గా తీసుకొని వచ్చి మండపంలో ప్రతిష్టించారు, ఈరోజు నుండి తొమ్మిది రాత్రులు పూర్తి చేసుకొని ఈ నెల 23,నవరాత్రుల ఉత్సవాలు ముగియనున్నాయి,అని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు

## సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా
# ఘనంగా మహిళా స్కూటర్ ర్యాలీ





**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహిళా స్కూటర్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. చార్మినార్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి అసెంబ్లీ ముందు ఉన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ ప్రారంభానికి ముందు తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో రాష్ట్ర, జిల్లా స్థాయి మహిళా నాయకులు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో మహిళలు స్కూటర్లు, ద్విచక్ర వాహనాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**నిజాం నిరంకుశ పాలనను తెలంగాణ ప్రజలు మరిచిపోలేరు..**
**-రామచందర్ రావు**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో మహిళలపై జరిగిన దమనకాండ, రజాకార్ల అరాచకాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరన్నారు.మహిళల గౌరవాన్ని కాపాడేందుకు తెలంగాణ మహిళలు సైతం ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు.

నిజాం నిరంకుశ పాలన,రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం ఫలితంగానే ఈ ప్రాంతానికి విముక్తి లభించిందన్నారుఅయితే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ విమోచన చరిత్రను వక్రీకరిస్తున్నాయని రామచందర్ రావు విమర్శించారు.

**విమోచన దినోత్సవ వేడుకల్లో ప్రజలంతా పాల్గొనాలి.. : జి.కిషన్ రెడ్డి**

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకల్లో తెలంగాణ ప్రజలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకుండా గత ప్రభుత్వాలు చరిత్రను విస్మరించాయని అన్నారు.ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తెలంగాణ విమోచన పోరాట చరిత్రను మరుగునపరిచే ప్రయత్నాలను తెలంగాణ సమాజం మర్చిపోవద్దని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను హైదరాబాద్ లిబరేషన్ డేగా అధికారికంగా నిర్వహిస్తూ తెలంగాణ విమోచన చరిత్రకు గౌరవం కల్పిస్తోందని తెలిపారు.ఈ చారిత్రక పోరాటం భావితరాలకు అందించాల్సిన గొప్ప స్ఫూర్తిదాయక చరిత్ర అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న జరిగే కేంద్ర ప్రభుత్వ అధికారిక వేడుకల్లో ప్రజలంతా పాల్గొనాలని ఆహ్వానం పలికారు.



**తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించాలి.. : నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన రోజని అన్నారు.నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దమనకాండను ఎదిరించి తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాట చరిత్రను నేటి యువత, భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

విమోచన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబర్ 17ను ఘనంగా నిర్వహించాలని, తెలంగాణ విమోచన చరిత్రకు తగిన గౌరవం కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్కూటర్ ర్యాలీని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు, వేముల అశోక్,బండారు విజయలక్ష్మి,బండా కార్తిక రెడ్డి, జయశ్రీ, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు ఉమా మహేశ్వర్,దీపక్ రెడ్డి,సుభాష్ చందర్ తదితరులు పాల్గొని ర్యాలీని సమన్వయం చేశారు.మహిళల భారీ భాగస్వామ్యంతో మహిళా స్కూటర్ ర్యాలీ విజయవంతంగా జరిగింది.

# గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి






### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన షాద్‌నగర్ నియోజకవర్గ గిరిజన నాయకుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ గిరిజన సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు,గిరిజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,తెలంగాణలో గిరిజనుల జనాభా ప్రాతిపదికన 6 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని అన్నారు. 2022 సెప్టెంబర్ 17న 10 శాతం రిజర్వేషన్లపై నిర్ణయం ప్రకటించబడిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ నెల 17వ తేదీకి గిరిజన రిజర్వేషన్ల పెంపు నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని తండాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేయాలని గిరిజన నాయకులు, కార్యకర్తలకు అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి**

2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిందని అంజయ్య యాదవ్ అన్నారు.పోడు భూములపై అర్హులైన గిరిజనులందరికీ హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మూడు గిరిజన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్ల చొప్పున నిధులుకేటాయిస్తామని చెప్పారు.ప్రతి మండలంలో గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.మరి ఆ మూడు గిరిజన కార్పొరేషన్లు ఎక్కడ? ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్లు కేటాయిస్తామన్న హామీ ఏమైంది? ఒక్క రూపాయి అయినా కేటాయించారా?ప్రతి మండలంలో గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పిన మాట ఏమైంది?అని అంజయ్య యాదవ్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గిరిజనులను ఆకట్టుకునేందుకు హామీలు ఇచ్చి,అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. గిరిజనుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై గ్రామాలు,తండాల్లో ప్రజలకు వివరించాలని గిరిజన నాయకులకు అంజయ్య యాదవ్ సూచించారు. గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు,సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రతి తండా నుంచి గిరిజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,గిరిజన నాయకులు మిట్టు నాయక్,లక్ష్మణ్ నాయక్,రాజు నాయక్,గోపాల్ నాయక్,హన్య నాయక్,అమ్రు నాయక్,రవి నాయక్,రాం చరణ్, లక్ష్మణ్,దశరథ్,హరి నాయక్, లచ్చు నాయక్,కిషన్ నాయక్ తదితరులు,నియోజకవర్గ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ గిరిజన శ్రేణులు పాల్గొన్నారు.

# నవీన్ రెడ్డి వర్గమే.. కానీ నికార్సైన బీఆర్ఎస్ కార్యకర్తలం

**కోడిచర్ల తండాలో ఒక మాజీ సర్పంచ్ తప్ప..మిగతా వారంతా బీఆర్ఎస్ కార్యకర్తలు కాదా?**

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నాయకత్వం కోరుకుంటే పార్టీ కార్యక్రమాలకు దూరం పెడతారా?**

**కొత్తూరు మండలం బిఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బిచ్యా నాయక్**





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నామనే కారణంతో తమను నవీన్ రెడ్డి వర్గంగా ముద్ర వేసి బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలు,సమావేశాలకు దూరం పెడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ కొత్తూరు మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు, కోడిచర్ల తండా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బిచ్యా నాయక్ ప్రశ్నించారు.షాద్‌నగర్‌లో నిర్వహిస్తున్న నియోజకవర్గ బీఆర్ఎస్ గిరిజన నాయకుల సమావేశానికి తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని బిచ్యా నాయక్ తెలిపారు.

**ఎస్టీ సెల్ అధ్యక్షుడినీ నాకు సమాచారం ఇవ్వరా**

కొత్తూరు మండల బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడినని. గిరిజన నాయకుల సమావేశం నిర్వహిస్తూ కనీసం నాకు సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్వహిస్తారు? గిరిజన విభాగానికి సంబంధించిన సమావేశం నిర్వహించేటప్పుడు సంబంధిత ఎస్టీ సెల్ నాయకుడికి సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత లేదా అని ఆయన నిలదీశారు.కోడిచర్ల తండా గ్రామ పంచాయతీ విషయాన్ని ప్రస్తావిస్తూ,కోడిచర్ల తండా గ్రామ పంచాయతీలో ఒక మాజీ సర్పంచ్ తప్ప మిగతా నాయకులు,కార్యకర్తలు బీఆర్ఎస్‌తోనే ఉన్నారు. అలాంటప్పుడు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నామనే కారణంతో మమ్మల్ని పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టడం ఎందుకు అని ప్రశ్నించారు.మేము నవీన్ రెడ్డి వర్గమే ఆయన నాయకత్వాన్ని కోరుకుంటున్నాం.అందులో మాకు ఎలాంటి దాపరికం లేదు. కానీ అంతకంటే ముందు మేము నికార్సైన బీఆర్ఎస్ కార్యకర్తలం బీఆర్ఎస్ జెండా కోసం,పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలం.అని బిచ్యా నాయక్ స్పష్టం చేశారు. నవీన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఆయన కూడా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకుడే. ఆయన నాయకత్వాన్ని కోరుకోవడం వల్ల మమ్మల్ని బీఆర్ఎస్‌కు దూరంగా చూడటం,పార్టీ కార్యక్రమాలకు పిలవకపోవడం ఏ రాజకీయ న్యాయం అని నిలదీశారు.నవీన్ రెడ్డి వర్గం అని మమ్మల్ని పిలవడం మీ ఇష్టం.కానీ ఆ పేరుతో మమ్మల్ని పార్టీకి దూరం చేయడం మాత్రం సరికాదు.మేము నవీన్ రెడ్డి వర్గమే..అదే సమయంలో నికార్సైన బీఆర్ఎస్ కార్యకర్తలం.పార్టీలో నాయకత్వంపై అభిప్రాయం ఉన్న కార్యకర్తలను వర్గాల పేరుతో దూరం చేయకుండా,అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని బిచ్యా నాయక్ అన్నారు.సమావేశాలకు పిలవకపోవచ్చు.. పార్టీ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకపోవచ్చు.. కానీ ప్రజల మధ్య మా పని ఆగదు. కార్యకర్తలతో మా అనుబంధం తెగదు.నవీన్ రెడ్డి నాయకత్వంపై మా నమ్మకం మారదు.బీఆర్ఎస్ పైమా నిబద్ధత కూడా తగ్గదు అని బిచ్యా నాయక్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చిన సామాజిక సేవకుడు

**ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు కందకట్ల సిద్ధురెడ్డి**

**సొంత ఖర్చులతో మౌలిక వసతులు కల్పిస్తానని హామీ**



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 15,** సమాజ సేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు కందకట్ల సిద్ధురెడ్డి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చారు. శంషాబాద్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన సిద్ధురెడ్డికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణ,భవనం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, మధ్యాహ్న భోజన పథకం, ఆట స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కందకట్ల సిద్ధురెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శంషాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను త్వరలోనే తన సొంత ఖర్చులతో కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి, వారి ఉన్నత చదువులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. సిద్ధురెడ్డి ఇచ్చిన హామీ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు.గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, విద్యార్థులకు సహాయ కార్యక్రమాలు చేపట్టిన సిద్ధురెడ్డి సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అక్రమ్, ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో సమస్యలు తీర్చండి

**గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత**

**సమస్య తీర్చాలనిప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్..**

**ఆశ్రమ బాలికల పాఠశాలల పైన దృష్టి పెట్టని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి..**





**వాజేడు, సెప్టెంబర్ 16,(ప్రజావినికిడి):** కోట్లాది రూపాయలు నిధులు గిరిజన సంక్షేమ శాఖ కు కేటాయించినట్టు లెక్కలు చూపే పాలక ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సంక్షోభం తప్ప గిరిజన సంక్షేమం ఎక్కడ కానరాదు అని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ ఆరోపించారు. వాజేడు మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలను ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా,మండల నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉన్న విద్యార్థులు సమస్యల వలయంలో కొట్టు మీట్టాడు తున్నారని అయన మండిపడ్డారు.గిరిజన పిల్లలు చదువుతున్న పాఠశాలలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు చదువు అరాకోరగ ఉందని ఆదివాసీ పిల్లలపై ఇంత చిన్న చూపు ఎందుకని మండిపడ్డారు.అలాగే మరుగుదొడ్లు, మంచినీరు కూడా సరిగా లేవన్నారు. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు అడవిలాగా అల్లుకొని ఉన్నాయంన్నారువర్కర్స్ కూడా ముగ్గురే ఉన్నారని విద్యార్థులకు రక్షణగా వాచ్ మెన్ కూడా లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గిరిజన విద్యార్థులు చదివే ఈ పాఠశాలకు సరైనా వసతులు పరిసరాల పరిశుభ్రత లేకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉందన్నారు. పాఠశాలలో ఆట స్థలం,ఆట వస్తువులు లేకపోవడం తో గిరిజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ఈ సమస్యలపై పలుమార్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి, సంబంధిత అధికారులకు తెలియజేసిన సమస్యను పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. వందల కోట్ల రూపాయలు గిరిజన సంక్షేమానికి కేటాయిస్తున్నాం అని చెప్పే పాలక ప్రభుత్వం వాటిని ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ పాఠశాలల పైన పట్టింపు కరువు అవ్వడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నట్లు తెలియజేసారు. పెద్దగొల్లగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలకు ఉపాధ్యాయులను,వసతులు కల్పించే వరకు దశల వారి ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. అవసరమైతే విద్యార్థులతో తల్లిదండ్రులతో భారీ ఎత్తున ఐటిడిఏ ముట్టడి చేస్తామని ఈ సందర్భంగా సాగర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో వాజేడు మండల ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, పీర్ల.రవిరాజు, కోరం మనోజ్ పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనది

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**





**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 15,** భావి భారత పౌరులను,రేపటి సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. శంషాబాద్ మండల పరిధిలో విద్యార్థుల అభివృద్ధికి విశేష సేవలందించిన గురువులను సత్కరించేందుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2026 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శంషాబాద్ ఎంపీడీఓ ఆఫీస్ కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. మండల విద్యాధికారి, మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో, విద్యారంగంలో అత్యుత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాలతో సత్కరించి, వారికి జ్ఞాపికలు (అవార్డులు) అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ,భావి భారత పౌరులను,రేపటి సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఉత్తమ పురస్కారాలు అందుకున్న గురువులందరికీ ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి, ఎంపీడీవో మున్ని,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి , మోహన్ రావు, బాల స్వామి, బాల్ రెడ్డి, వీరమల్లేష్, భాస్కర్, బాలరాజ్ మరియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు,
మండల ఉపాధ్యాయులు ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి..

**తెలంగాణ భూరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య**



**అబిడ్స్, (ప్రజావినికిడి):** రాష్ట్రంలోని పేద ప్రజలకు గతంలో కేటాయించిన అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించి,వెంటనే పట్టాలు జారీ చేయాలని తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాపోలు రాములు,చింత స్వామిలతో కలిసి ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి,కేజీ టు పీజీ ఉచిత విద్య వంటి ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. పైగా ధరణి,రైతు వేదికలు,స్మశాన వాటికలు, ప్రభుత్వ కార్యాలయాల పేరిట గత ప్రభుత్వం దళితుల భూములను లాక్కుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో పేద దళితులకు ఆత్మగౌరవంతో జీవించేందుకు లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేసిందని వారు గుర్తుచేశారు. రాళ్ళు, రప్పలు కొట్టి గత 40-50 ఏళ్లుగా ఆ భూములను సాగు చేసుకుంటున్న దళితులకు ఇప్పటి వరకు పూర్తి హక్కులు దక్కకపోవడం శోచనీయమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో,చేవెళ్ల 'దళిత డిక్లరేషన్'లలో అసైన్డ్ భూములపై అమ్ముకునే హక్కుతో పాటు సమగ్ర యాజమాన్య హక్కులు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్ తదితర నగరాల విస్తరణ పేరుతో రియల్టర్లు, భూస్వాములు దళితుల భూములపై కన్నేసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అసైన్డ్ భూములను 'సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, దళితులకు శాశ్వత పట్టాలు ఇచ్చే చట్టబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి,శక్తి లక్ష్మణ్,సంపత్, నత్తి లచ్చన్న, సిద్ధ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో విషాద ఘటన..

## హాస్టల్ భవనంపై నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య



హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 23 ఏళ్ల యువకుడు తాను నివసిస్తున్న హాస్టల్ భవనం పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన యశ్వంత్ (23) గచ్చిబౌలిలోని ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిరీత్యా పది రోజుల క్రితమే అతడు మాదాపూర్‌లోని ఒక కో-లివింగ్ హాస్టల్‌లో చేరాడు.మంగళవారం తనకు ఆరోగ్యం బాగాలేదని యశ్వంత్ హాస్టల్ సిబ్బందికి తెలిపినట్లు సమాచారం. ఆ తర్వాత కొద్దిసేపటికే అతడు భవనం పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకేశాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, యశ్వంత్ ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

# ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్..
## కఠిన చర్యలకు ఆదేశం



**అమరావతి సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

# కర్ణాటకలో విషాద ఘటన.. ఫ్రిజ్ పేలి నలుగురు మహిళలు మృతి

**కర్ణాటకలోని బెళగావిలో ఘోర ప్రమాదం**

**రిఫ్రిజిరేటర్ పేలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**

**మరో ఇద్దరికి 60 శాతం కాలిన గాయాలు, పరిస్థితి విషమం**


**ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**బెళగావి సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
కర్ణాటకలో విషాద ఘటన చోటుచేసుకుంది. బెళగావి జిల్లాలోని ఒక ఇంట్లో రిఫ్రిజిరేటర్ పేలడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బెళగావి నగరంలోని సెంట్రల్ బస్ స్టాండ్ సమీపంలో గల చవత్ గల్లీలో రాజారాం కుటుంబం నివసిస్తోంది. మంగళవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇంట్లోని రిఫ్రిజిరేటర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. ఈ పేలుడు ధాటికి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారిలో నలుగురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను శారద (50), ఆమె కుమార్తెలు ప్రియ, గంగతో పాటు భారతి అనే మహిళగా గుర్తించారు. వీరంతా మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో రాజారాంతో పాటు రోహన్ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.
ప్రమాదంలో గాయపడిన వారి శరీరాలు 60 శాతానికి పైగా కాలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ విషాద ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, ఆ ఫ్రిజ్ కొత్తదని తెలుస్తోంది.

# ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం..
## నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

**హైదరాబాద్ సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు.



ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

# రూ.3.93 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్న ఆర్‌బీఐ..

**బ్యాంకింగ్ వ్యవస్థలో అధిక ద్రవ్య లభ్యతను తగ్గించేందుకు ఆర్‌బీఐ చర్యలు**

**వీఆర్ఆర్ఆర్ వేలం ద్వారా రూ.3.93 లక్షల కోట్లను సమీకరణ**

**ఎఫ్‌సీఎన్ఆర్-బీ డిపాజిట్ల కారణంగా వ్యవస్థలో భారీగా పెరిగిన నగదు**

**మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడమే ప్రధాన లక్ష్యం**




**సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన అదనపు ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) నియంత్రించేందుకు ఆర్‌బీఐ మరోసారి రంగంలోకి దిగింది. తాజాగా నిర్వహించిన 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో' (వీఆర్ఆర్ఆర్) వేలం ద్వారా రూ.3,93,352 కోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నిధులను తగ్గించి, మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. ఈ వేలం కోసం ఆర్‌బీఐ రూ.5 లక్షల కోట్ల నోటిఫైడ్ మొత్తాన్ని ప్రకటించగా, బ్యాంకుల నుంచి రూ.3,93,352 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. వచ్చిన బిడ్లన్నింటినీ ఆర్‌బీఐ ఆమోదించింది. ఈ నిధులను 5.24 శాతం కటాఫ్, వెయిటెడ్ యావరేజ్ రేటుతో స్వీకరించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 11 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సుమారు రూ.10.73 లక్షల కోట్లుగా ఉన్నట్లు అంచనా.
బ్యాంకులు ఇటీవల భారీగా ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్-బీ) డిపాజిట్లను సమీకరించడమే ఈ అదనపు నగదుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ డిపాజిట్ల ద్వారా వచ్చిన విదేశీ కరెన్సీని బ్యాంకులు ఆర్‌బీఐతో స్వాప్ చేసుకోవడంతో వాటికి పెద్ద మొత్తంలో రూపాయి ద్రవ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ అదనపు నిధులను నియంత్రించేందుకు గత నెల నుంచి ఆర్‌బీఐ వరుసగా వీఆర్ఆర్ఆర్ వేలాలను నిర్వహిస్తోంది. వీఆర్ఆర్ఆర్ వేలంతో పాటు మరో కీలకమైన చర్యను కూడా ఆర్‌బీఐ ప్రకటించింది. అదనపు ద్రవ్యాన్ని మరింత సమర్థంగా నియంత్రించేందుకు ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) కింద రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించనుంది. మూడు విడతల్లో ఈ అమ్మకాలు జరగనున్నాయి. మొదటి విడతలో భాగంగా సెప్టెంబర్ 17న రూ.50,000 కోట్ల విలువైన సెక్యూరిటీలను విక్రయిస్తారు. ఆ తర్వాత సెప్టెంబర్ 21, 28 తేదీల్లో రూ.25,000 కోట్ల చొప్పున రెండు విడతల్లో వేలాలు జరుగుతాయి. ఇదే నెల ఆరంభంలో నిర్వహించిన ఓవర్ నైట్ వీఆర్ఆర్ఆర్ వేలంలో కూడా ఆర్‌బీఐ రూ.3.53 లక్షల కోట్లకు పైగా నిధులను సమీకరించింది.

# 'అలయ్ బలయ్'కి రండి..
## చంద్రబాబును కలిసి ఆహ్వానించిన దత్తన్న



**హైదరాబాద్ సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో, అక్టోబర్ 22న నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని చంద్రబాబును దత్తాత్రేయ ప్రత్యేకంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఆత్మీయతను చాటుతున్న 'అలయ్ బలయ్' విశిష్టతను చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. దత్తాత్రేయ ఆహ్వానం పట్ల చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. దత్తాత్రేయ మాట్లాడుతూ, "అలయ్-బలయ్ వేదిక తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు సమాజంలోని వివిధ వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించే వేదిక" అని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో కేవలం ఆహ్వానం మాత్రమే కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఉభయ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం, ఉమ్మడి ప్రయోజనాలు, తెలుగు ప్రజల ఐక్యత, పరస్పర సహకారం వంటి కీలక అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

# లోకల్ ఫైట్.. జనసేన వ్యూహం ఏంటి?



**అమరావతి సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
స్థానిక ఎన్నికల విషయంలో జనసేన పార్టీ వ్యూహం ఆసక్తి రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా తాము త్యాగాలు చేయడానికి సిద్ధంగా లేమని, బలం ఉన్న చోట పోటీచేస్తామని కరాఖండీగా చెబుతున్న జనసేన పార్టీ అదే సమయంలో మిత్రపక్షం టీడీపీని ఇరుకున పెట్టేలా ప్రకటనలు చేస్తుండటం వ్యూహంలో భాగమేనా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు బలం ఉందని ఒకవైపు చెబుతూ, మరోవైపు మిత్రపక్షం టీడీపీ తొక్కేస్తుందంటూ ప్రకటనలు చేయడమే అంతుచిక్కడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమిలో టీడీపీ వైఖరిని ప్రశ్నిస్తూ జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే ఎమ్మెల్యే బొలిశెట్టి చేసిన ప్రకటనకు ఆ పార్టీ అధిష్ఠానం కూడా కట్టుబడి ఉన్నట్లు ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్నాయని అంటున్నారు.
కూటమిలో టీడీపీ-జనసేన సంబంధాలపై విస్తృత చర్చ జరుగుతోంది. తాము మరో మూడు సాధారణ ఎన్నికల వరకు కలిసి ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంగా ప్రకటనలు చేస్తున్నారు. కానీ, ఆయా పార్టీలకు చెందిన నాయకులు మాత్రం భిన్న స్వరాలు వినిపిస్తూనే ఉన్నారు. ఇటీవల ఒంగోలులో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్ మిత్రపక్షం టీడీపీకి చెందిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పై బహిరంగ విమర్శలు చేయగా, కొద్దిరోజుల క్రితం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి ఏకంగా టీడీపీ పార్టీ వైఖరిని నిందిస్తూ చేసిన వ్యాఖ్యలు మరింత వేడిని పెంచాయని అంటున్నారు.
స్థానిక ఎన్నికల సమయంలో ఇటువంటి ప్రకటనలు చేయడాన్ని వ్యూహంలో భాగంగానే చూడాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. జనసేన నేతలు వరుసగా కూటమి ఐక్యతను ప్రభావితం చేసేలా మాట్లాడుతున్నప్పటికీ ఆ పార్టీ హైకమాండ్ కల్పించుకోకపోవడం చూస్తే తమ మనోగతం తెలియజేసేందుకు ఆ పార్టీ ఒక పద్ధతి ప్రకారం ఇటువంటి ఎత్తుగడ ఎంచుకుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీతో సమానంగా ప్రాతినిధ్యం ఉండాలని జనసేన నేతలు కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే పెద్దపార్టీ అయిన టీడీపీతో సమానంగా ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ తమ బలానికి తగినట్లు గౌరవం పెరిగేటట్లు సీట్ల కేటాయింపు ఉండాలని జనసేన కోరుకుంటున్నట్లు చెబుతున్నారు.
రాష్ట్రంలో జనసేనకు ప్రస్తుతం 21 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మొత్తం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను తమ పార్టీకి వదిలేయాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో అదనంగా విజయవాడ, మచిలీపట్నం, ఏలూరు, ఒంగోలు, గుంటూరు కార్పొరేషన్లు జనసేన అడుగుతుందని చెబుతున్నారు. కాకినాడ, తిరుపతి కార్పొరేషన్లలో జనసేన ఎమ్మెల్యేలు ఉండటంతో ఆ స్థానాలు తమకే ఇవ్వాలని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీ నేతలు కంగారు పడుతున్నారని అంటున్నారు. రాష్ట్రంలో దాదాపు 17 కార్పొరేషన్లు ఉండగా, అందులో 8 నుంచి 9 స్థానాలను జనసేన అడుగుతుండటమే పరిస్థితిని వేడెక్కిస్తోందని అంటున్నారు. అయితే ఇదంతా జనసేన వ్యూహాత్మక ఎత్తుగడగా పరిశీలకులు భావిస్తున్నారు. కూటమిలో టీడీపీపై ఈ స్థాయిలో ఒత్తిడి తేకపోతే జనసేనకు రెండు లేదా మూడు స్థానాలతో సరిపెట్టే అవకాశాలు ఉన్నాయని, సగం కార్పొరేషన్లకు కర్చీఫ్ వేస్తే నాలుగో వంతు స్థానాలు అయినా ఇవ్వకపోతారా? అన్నట్లు ఆ పార్టీ ఆలోచనలు ఉన్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు




**చంపాపేట డివిజన్ కర్మన్ ఘాట్ మాధవ్ నగర్ కాలనీ నందు వారధి యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన బాల గణేశుడు..**

# మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు



**నిజామాబాద్ సెప్టెంబర్ 15 (ప్రజావినికిడి):**
దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు.
ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (SIB), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు.
ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు.
ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఛాంపియన్ జ్వెరెవ్



## కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వశం

## ఫైనల్లో బెన్ షెల్టన్‌పై ఘన విజయం

## యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2026

**న్యూయార్క్ (యుఎస్ఏ) :** యుఎస్ ఓపెన్‌కు కొత్త ఛాంపియన్. మహిళల సింగిల్స్‌లో ఎలెనా రిబకినా తొలిసారి ఛాంపియన్‌గా అవతరించగా, పురుషుల సింగిల్స్‌లోనూ నయా చాంపియన్ వచ్చాడు. టాప్ సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అమెరికా ఆటగాడు, ఎనిమిదో సీడ్ బెన్ షెల్టన్‌పై అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-3, 7-6(7-2), 5-7, 6-2తో ఘన విజయం సాధించాడు. నాలుగు సెట్ల పోరులో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆరంభం నుంచి ఛాంపియన్ ఆటతీరు కనబరిచాడు. తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫైనల్‌కు చేరుకున్న బెన్ షెల్టన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన జ్వెరెవ్‌కు.. ఈ ఏడాదిలో ఇది రెండో విజయం. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ విజయంతో జ్వెరెవ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల ఖాతా తెరిచిన సంగతి తెలిసిందే. **జ్వెరెవ్ జయహో..** గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గని ప్రతిభావంతుడు'గా అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై టెన్నిస్ వర్గాల్లో ఓ ముద్ర పడింది. రోజర్ ఫెడరర్, రాఫెల్ నాదల్, నొవాక్ జకొవిచ్ త్రయం జోరులో పెద్దగా వెలుగులోకి రాని జ్వెరెవ్.. ఆ తర్వాత అల్కరాస్, సినర్ దూకుడుతో వెనుకంజ వేశాడు. ఈ ఏడాది ఏకంగా మూడు గ్రాండ్‌స్లామ్స్‌లో ఫైనల్‌కు చేరిన జ్వెరెవ్ రెండు టైటిల్స్‌తో సత్తా చాటాడు. గతంలో జ్వెరెవ్ మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరినా.. టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయాడు. ఆదివారం న్యూయార్క్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్లో జ్వెరెవ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. ప్రత్యర్థి తొలిసారి ఫైనలిస్ట్ కావటంతో.. జ్వెరెవ్ అనుభవంతో పాటు వరల్డ్ క్లాస్ ఆటతీరుతో పైచేయి సాధించాడు. తొలి సెట్లోనే బ్రేక్ సాధించిన జ్వెరెవ్ 6-3తో ముందంజ వేశాడు. రెండో సెట్లో షెల్టన్ నుంచి ప్రతిఘటన ఎదురైనా.. టైబ్రేకర్‌లో 7-2తో జ్వెరెవ్‌దే పైచేయిగా నిలిచింది. కీలక మూడో సెట్లో షెల్టన్ పుంజుకున్నాడు. జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి 7-5తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. కానీ నాల్గో సెట్లో మరోసారి పైచేయి సాధించిన జ్వెరెవ్ 6-2తో నాల్గో సెట్‌తో పాటు యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను ఎగరేసుకుపోయాడు. అలెగ్జాండర్ జ్వెరెవ్ 9 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించగా.. బెన్ షెల్టన్ 10 ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్‌తో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల పరంగా 125-113తో జ్వెరెవ్ ఆధిపత్యం చూపించాడు. జ్వెరెవ్ 24 గేములు గెలుపొందగా, షెల్టన్ 18 గేములే నెగ్గాడు. **ఛాంపియన్ భావోద్వేగం** యుఎస్ ఓపెన్ టైటిల్ సాధించిన అనంతరం అలెగ్జాండర్ జ్వెరెవ్ భావోద్వేగానికి లోనయ్యా డు. నాలుగేండ్ల వయసులోనే మధుమే హంతో బాధపడుతున్న తనని.. తన తల్లి ఏ విధంగా చాంపియన్‌గా తీర్చిదిద్దిందో జ్వెరెవ్ గుర్తు చేసుకున్నాడు. '4 ఏండ్ల కొడుకు డయాబెటిస్‌తో బాధపడుతున్నాడు. సాధారణ జీవితం, స్పోర్ట్స్ ఆ పిల్లవాడికి ఎంతో పరిమితమని వైద్యులు చెప్పారు. అయినా, నా కొడుకు టెన్నిస్ ప్లేయర్ కావాలని అనుకుంటే, టెన్నిస్ ప్లేయర్ అవుతాడు. జీవితంలో ఇంకేదైనా సాధించాలని అనుకుంటే అదీ సాధిస్తాడు అనే దీమాతో అమ్మ నన్ను పెంచింది. వెన్నంటి నిలిచి టెన్నిస్ ప్లేయర్‌గా, గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా నిలబెట్టింది' అని జ్వెరెవ్ కన్నీటి పర్యంతమవుతూ తన విజయంలో అమ్మ పాత్రను అభిమానులతో పంచుకున్నాడు.

# సిరీస్ మనదే



## 3 వికెట్లతో మెరిసిన నితీశ్

## అర్ధ సెంచరీతో చెలరేగిన సంజు

## రెండో టీ20లో భారత్ ఘన విజయం

## అఫ్గనిస్తాన్ 159/8, భారత్ 163/3

**న్యూఢిల్లీ :** వరుసగా రెండో టీ20లో టీమ్ ఇండియా ఏకపక్ష విజయం నమోదు చేసింది. బంతితో, బ్యాట్‌తో ఎదురులేని ప్రదర్శన కనబరిచిన శ్రేయస్ సేన 7 వికెట్ల తేడాతో అఫ్గనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (57, 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అభిషేక్ శర్మ (39, 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు), ఇషాన్ కిషన్ (38 నాటౌట్, 23 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. 14.5 ఓవర్లలోనే 3 వికెట్లకు భారత్ 163 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (37, 33 బంతుల్లో 6 ఫోర్లు), రషీద్ ఖాన్ (28, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), డార్విశ్ రసూల్ (26, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), మహ్మద్ నబి (20, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అఫ్గాన్‌కు గౌరవప్రద స్కోరు అందించారు. భారత బౌలర్లలో పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (3/24) మూడు వికెట్లు పడగొట్టగా.. అర్ష్‌దీప్ సింగ్ (2/35), జశ్‌ప్రీత్ బుమ్రా (1/25), అక్షర్ పటేల్ (1/28), రవి బిష్ణోయ్ (1/32) రాణించారు. భారత్, అఫ్గనిస్తాన్ మూడో టీ20 గురువారం ఫిరోజ్ షా కోట్ల స్టేడియంలోనే జరుగనుంది.

# విజేత హైదరాబాద్ గ్లోబ్

## - సీసీఓబీ ఫుట్‌బాల్ కప్




హైదరాబాద్ : సిటీకాలేజ్ ఓల్డ్ బాయ్స్ (సీసీఓబీ) ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీసీఓబీ కప్ (అండర్-21) విజేతగా హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో హైదరాబాద్ స్పోర్టింగ్ ఎఫ్‌సీపై 1-0తో హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ గెలుపొందింది. సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్ 55వ నిమిషంలో గెలుపు గోల్ అందించాడు. అంతకుముందు సెమీఫైనల్లో ఆతిథ్య సీసీఓబీపై 1-0తో, క్వార్టర్‌ఫైనల్లో సైదాబాద్ ఎఫ్‌సీపై 5-0తో హైదరాబాద్ గ్లోబ్ గెలుపొందింది. హైదరాబాద్ గ్లోబ్ ఎఫ్‌సీ జట్టును, కోచ్‌లు వహీద్ ఖాన్, సయ్యద్ ఓవైస్ ఉద్దీన్‌లను సీసీఓబీ క్లబ్ అధికారులు అభినందించారు.

# మెరిసిన శాంసన్, నితీశ్..
# టీ20 సిరీస్ టీమిండియా వశం..!

మూడు టీ20ల సిరీస్‌లో జోరు చూపిస్తున్న భారత్.. వరసగా రెండో మ్యాచ్‌లోనూ అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో నితీశ్ రెడ్డి(3-35) బంతితో రాణించగా.. ఆపై ఓపెనర్లు అభిషేక్ శర్మ(39) సంజూ శాంసన్(57)లు దంచేశారు. అర్ధ శతకంతో విరుచుకుపడిన సంజూను రషీద్ ఖాన్ బోల్తా కొట్టించినా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్) సాయంతో ఇషాన్ కిషన్(38 నాటౌట్) లాంఛనం ముగించాడు. ఏడు వికెట్ల విజయంతో సిరీస్‌ను పట్టేసింది టీమిండియా. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌ల నుంచి తేరుకున్న టీమిండియా స్వదేశంలో గర్జించింది. అఫ్గనిస్థాన్‌పై వరసగా రెండు విజయాలతో టీ20ల సిరీస్‌ను గెలుచుకుంది భారత్. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో నెగ్గిన అయ్యర్ సేన.. ఈసారి వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్లు అభిషేక్ శర్మ(39), సంజూ శాంసన్(57) మెరుపు ఆరంభమిచ్చారు. రెండు ఓవర్లలోనే నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 47 రన్స్ పిండుకుందీ ద్వయం. అభిషేక్ ఔటైనా.. తనమార్క్ షాట్లతో అలరించిన శాంసన్ అర్ధ శతకం బాదాడు. అయితే.. రషీద్ ఖాన్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించి సంజూ బౌండరీ వద్దనబీ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి రషీద్ ఓవర్లోనే శ్రేయాస్ అయ్యర్(11)ను డైవింగ్ స్లిప్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. ఇషాన్ కిషన్(38 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వలేదు. అప్పటికే విజయం ఖరారు కాగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేశాడు ఇషాన్. 15వ ఓవర్లో బౌండరీతో జట్టును గెలిపించాడీ చిచ్చరపిడుగు. 7 వికెట్లతో జయభేరి మోగించిన మెన్ ఇన్ బ్లూ మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ పట్టేసింది.




నామమాత్రమైన మూడో టీ20 సెప్టెంబర్ 17న జరుగనుంది. **నబీ, రషీద్ ధనాధన్** టాస్ ఓడిన అఫ్గనిస్థాన్‌కు మొదటి ఓవర్లోనే షాకిచ్చాడు అర్ష్‌దీప్ సింగ్. తొలి మ్యాచ్‌లో డకౌటైన ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్(0)ను అతడు సున్నాకే పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నితీశ్ రెడ్డి(3-35) ఓవర్లో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్(37)పెద్ద షాట్ ఆడి రవి బిష్ణోయ్ చేతికి చిక్కాడు. ధాటిగా ఆడుతున్న సెదీకుల్లా అటల్(12)ను రవి బిష్ణోయ్ ఔట్ చేయగా.. గుల్బదిన్(10), డార్విష్ రసూలీ(26)లు విఫలమయ్యారు.

# ఐజా మిర్‌కు పసిడి పతకం



## - హైదరాబాద్ హార్స్ షో ఫైనల్స్

**హైదరాబాద్ :** హైదరాబాద్ హార్స్ షో ఫైనల్లో ఐజా మిర్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. అండర్-14 విభాగం 110-115సెమీ షో జంపింగ్ పోటీల్లో ఐజా మిర్ సత్తా చాటింది. ఈ విభాగంలో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సాధించిన ఐజా మిర్.. అండర్-14 విభాగం 100 సెమీ షో జంపింగ్‌లో నాల్గో స్థానంలో నిలిచింది. 25 మంది పోటీపడిన ఫైనల్లో ఐజా మిర్‌తో పాటు సెంతిల్, ఈశన్ భరద్వాద్, సంజయ్, ప్రభునూర్ సింగ్, వేదిక్, ఆమిర్, మిర్ నజముద్దీన్ ఆజామ్‌లు పతక ప్రదర్శనతో ఆకట్టుకున్నారు

## టెస్టుల్లో ఫ్లాప్.. వన్డేల్లో తొలి శతకంతో

# రెచ్చిపోయిన కుర్రాడు..!

మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం అదరకున్నా వన్డేల్లో మాత్రం దంచేశాడు మ్యాట్ రెన్‌షా. బంగ్లాదేశ్‌పై తీవ్రంగా నిరాశపరిచిన అతడు జింబాబ్వేపై చితక్కొట్టాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ కుర్రాడు శతకం బాదేశాడు. బ్రాడ్ ఎవాన్స్ ఓవర్లో సింగిల్ తీసిన అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌లో మొదటి సెంచరీ నమోదు చేశాడు.స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో విఫలమైన ఆస్ట్రేలియా కుర్రాడు మ్యాట్ రెన్‌షా వన్డేల్లో శతక్కొట్టాడు. మంగళవారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వే బౌలర్లను ఈ లెఫ్ట్ హ్యాండర్ ఉతికేశాడు. టాపార్డర్ విఫలమైనా వన్డేల్లో మొదటి సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. 107కే నాలుగు వికెట్లు పడిన వేళ.. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చి ధనాధన్ ఆటతో అలరించిన అతడు 94 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 109 రన్స్ సాధించాడు.ఆతిథ్య బౌలర్లను ఎడాపెడా ఉతికేస్తూ.. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి రెన్‌షా విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు రెన్‌షా. దాంతో, ఆసీస్ 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న ఆస్ట్రేలియాకు.. రెన్‌షా రూపంలో ఆరో స్థానంలో అదరగొట్టే బ్యాటర్ దొరికాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# 'మండాడి' జాక్‌పాట్..

## 5 రోజుల్లోనే రూ. 65 కోట్ల వసూళ్లు!




తెలుగు నటుడు సుహాస్, తమిళ నటుడు సూరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మండాడి'. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడుదలైన కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 65 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది.ఈ చిత్రం సాధిస్తున్న ఘనవిజయం నిర్మాత ఎల్రెడ్ కుమార్‌కు భారీ లాభాలను తెచ్చిపెడుతోంది. సుమారు రూ. 45 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ కైవసం చేసుకుంది. అయితే, ఈ ఒప్పందం బాక్సాఫీస్ వసూళ్ల ఆధారంగా కుదరడం గమనార్హం. సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 50 కోట్లు దాటితే రూ. 30 కోట్లు, రూ. 60 కోట్లు దాటితే రూ. 40 కోట్లు చెల్లించేలా నెట్‌ఫ్లిక్స్ ఒప్పందం చేసుకుంది.ప్రస్తుతం 'మండాడి' వసూళ్లు రూ. 65 కోట్ల మార్కును అధిగమించడంతో, నిర్మాతకు నెట్‌ఫ్లిక్స్ నుంచి రూ. 40 కోట్లు అందనున్నాయి. థియేట్రికల్ వసూళ్లతో పాటు నాన్-థియేట్రికల్ హక్కుల ద్వారా కూడా నిర్మాతకు ఆశించిన దానికంటే ఎక్కువ లాభాలు వస్తున్నాయి. విభిన్నమైన కథాంశం, ఉత్కంఠ కలిగించే బోట్ రేసింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదే వేగం కొనసాగితే ఈ చిత్రం త్వరలోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఇద్దరం మంచి స్నేహితులం

## ఆనంద్ దేవరకొండతో రిలేషన్ లో ఉందనే వార్తలపై వైష్ణవి చైతన్య క్లారిటీ

టాలీవుడ్ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్యలు రిలేషన్ లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబి'తో పాటు 'ఎపిక్'లో కలిసి నటించిన ఈ జోడీ రీల్ లైఫ్ కెమిస్ట్రీ చూసి, వీరిద్దరూ రియల్ లైఫ్ లోనూ ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.

ఈ డేటింగ్ రూమర్లపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన వైష్ణవి చైతన్య, తమ మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని తేల్చి చెప్పింది. తామిద్దరం మంచి కో-స్టార్స్ మాత్రమే కాకుండా ఆత్మీయ స్నేహితులమని తెలిపింది. ఇదే సమయంలో ఆనంద్ దేవరకొండ పెళ్లి ప్రణాళికల గురించి మాట్లాడుతూ... రాబోయే మూడేళ్లలో వివాహం చేసుకుంటానని చెప్పాడు. అయితే తనకు మాత్రం ఇప్పట్లో వివాహం ఆలోచన లేదని, కేవలం సినిమాలపైనే దృష్టి సారిస్తానని వైష్ణవి స్పష్టం చేసింది.



# దేవిడ్ రెడ్డిలో రమ్యకృష్ణ ..

## ఫస్ట్‌లుక్‌తో అంచనాలు పెంచిన మేకర్స్



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న 'కమలా రెడ్డి' పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం.

పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు.


ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా 'క్లారా విట్‌మోర్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది.'డేవిడ్ రెడ్డి'కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి.మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

# కెరీర్‌లోనే అత్యంత కీలక పాత్రలో రష్మిక..

## ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ ఖరారు

### నిర్మాతలుగా అల్లు అరవింద్, బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేశ్



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును దక్కించుకున్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అధికారికంగా ఖరారైంది. 'ఎం.ఎస్. - ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటిగా రష్మిక కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్నారు.ఈ చిత్రం ప్రారంభోత్సవాన్ని రేపు (సెప్టెంబర్ 16న) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ కోరల్ ఎన్‌సెంబుల్ బృందం, సుబ్బులక్ష్మి ఆలపించిన కొన్ని అజరామర గీతాలతో సంగీత నివాళి అర్పించనుంది.'జెర్సీ' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాస్‌లతో కలిసి ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాత్ర కోసం చిత్రబృందం మొదట సాయి పల్లవి, రుక్మిణి వసంత్ వంటి నటీమణులను పరిశీలించింది. అయితే, ఇతర ప్రాజెక్టుల కారణంగా సాయి పల్లవి ఈ అవకాశం వదులుకున్నట్లు సమాచారం. అనంతరం నిర్వహించిన స్క్రీన్ టెస్టులో రష్మికను ఈ పాత్రకు ఎంపిక చేశారు.భారతరత్న పురస్కార గ్రహీత అయిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, కేవలం శాస్త్రీయ సంగీతానికే పరిమితం కాలేదు. ఆమె 'సేవాసదనం', 'శకుంతలై', 'సావిత్రి', 'మీరా' వంటి చిత్రాల్లో నటించి నటిగా కూడా తనదైన ముద్ర వేశారు. అలాంటి గొప్ప వ్యక్తి పాత్రను పోషించడం రష్మికకు నటిగా అతిపెద్ద సవాల్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక, రష్మిక నటిస్తున్న ఇతర సినిమాల విషయానికొస్తే.. యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నవంబర్ 27న విడుదల కానుండగా, విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆసక్తి రేపుతున్న 'అనుమాన పక్షి' ట్రైలర్




'డీజే టిల్లు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ మరో వినూత్న కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి'. టాలెంటెడ్ నటుడు రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ కథ మొత్తం హీరో పాత్రకున్న 'అనుమానం' అనే బలహీనత చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ప్రతి చిన్న విషయాన్ని అనుమానించే వ్యక్తిగా రాగ్ మయూర్ నటన, హావభావాలు నవ్వులు పూయిస్తున్నాయి. కేవలం కామెడీ మాత్రమే కాకుండా, క్రైమ్ థ్రిల్లర్, డార్క్ కామెడీ అంశాలను కూడా దర్శకుడు జోడించినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన కథతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. 'డీజే టిల్లు' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ ఎలాంటి వినోదాన్ని అందిస్తారోనని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613